


# విభారె

తెలుగు దినపత్రిక

VIBHARE TELUGU DAILY




PUBLISHED FROM KURNOOL ఎడిటర్ : ఆవుల విజయ భాస్కర రెడ్డి శనివారం 09-12-2023 సంపుటి : 06 సంచిక : 90 పేజీలు : 8 వెల : రూ 3-00

# సీఎం జగన్‌కు ఘన స్వాగతం..



(రేణిగుంట-( విభారె) రాష్ట్ర ముఖ్యమంత్రి వర్యులు వైయస్ జగన్మోహన్ రెడ్డి తిరుపతి జిల్లా లో మిచాంగ్ తుపా ను ప్రభావిత ప్రాంతాల పర్యటన నిమిత్తం శుక్రవారం ఉదయం 10.18 గంటలకు రేణిగుంట విమానాశ్రయానికి చేరుకున్న ముఖ్యమంత్రి వెంట రాష్ట్ర హోం శాఖ మంత్రివర్యులు తేనేటి వనిత ఉన్నారు. రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి మరియు జిల్లా ఇంఛార్జి మంత్రి కళత్తూరు నారాయణ స్వామి, రాష్ట్ర విద్యుత్, అటవీ, భూగర్భ గనుల శాఖ మంత్రి వర్యులు పెద్ది రెడ్డి రామ చంద్రా రెడ్డి, టూరిజం, సాంస్కృతిక, యువజన శాఖ మంత్రి ఆర్కె రోజా, ఎమ్మెల్సీ సిపాయి సుబ్రమణ్యం , తిరుపతి జిల్లా కలెక్టర్ కె వెంకటరమణారెడ్డి, డి ఐ జి అమ్మిరెడ్డి, తిరుపతి నగర పాలక సంస్థ కమిషనర్ హరిత, స్థానిక ఎమ్మెల్యే మరియు టిటిడి చైర్మన్ భూమన కరుణాకరరెడ్డి, చంద్రగిరి ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్ రెడ్డి, శ్రీకాళహస్తి ఎమ్మెల్యే మధుసూధన రెడ్డి, తిరుపతి నగర పాలక సంస్థ మేయర్ శిరీష, జెడ్పీ ఛైర్మెన్ గోవిందప్ప శ్రీనివాసులు, తిరుపతి ఆర్డీవో రవిశంకర్ రెడ్డి, అడిషనల్ ఎస్పీ విమలా కుమారి, తదితరులు ముఖ్యమంత్రికి స్వాగతం పలికిన వారిలో ఉన్నారు.అనంతరం 10.30 గం.లకు రేణిగుంట విమానాశ్రయం నుండి హెలికాప్టర్ ద్వారా తుఫాన్ ప్రభావిత ప్రాంతాల పర్యటన నిమిత్తం వాకాడుకు ముఖ్యమంత్రి బయల్దేరి వెళ్ళారు. వీరి వెంట రాష్ట్ర హోం శాఖ మంత్రివర్యులు తేనేటి వనిత, ఉప ముఖ్యమంత్రి నారాయణ స్వామి, జిల్లా కలెక్టర్ కె. వెంకట రమణా రెడ్డి ఉన్నారు.





తిరుపతి( విభారె) వరదల్లో నష్టపోయిన ప్రతి రైతును ఆదుకుంటామని రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి అన్నారు.సీఎం జగన్ తుపాను ప్రభావిత ప్రాంతాలైన తిరుపతి జిల్లాలో పర్యటించారు.శుక్రవారం ఉదయం ప్రత్యేక హెలికాప్టర్ లో తిరుపతి జిల్లాకు చేరుకున్న ఆయన, అధికారులతో కలిసి వాకాడు మండలం విద్యానగర్ వెళ్లారు. అనంతరం బాలిరెడ్డిపాలెం వెళ్లి అక్కడ స్వర్ణముఖి నది కట్ట తెగిన ప్రాంతాలను పరిశీలించారు. అక్కడి బాధిత గ్రామస్థులు, రైతులతో మాట్లాడారు.పంట నష్టం వివరాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం తుపా ను ప్రభావంపై ఫోటో ఎగ్జిబిషన్ ను సందర్శించారు. తర్వాత మురుప్రోలు వారిపాలెం, కర్లపాలెం, బుద్దాం గ్రామాల్లో దెబ్బతిన్న పంటలను పరిశీలించి రైతులకు నేరుగా మాట్లాడనున్నారు.అంతకు ముందు తిరుపతి జిల్లాలో తుపాను ప్రభావిత ప్రాంతాల్లో ఏరియల్ వ్యూ ద్వారా దెబ్బతిన్న పంటలను పరిశీలించారు.మిగ్ జాం తుపాను ప్రభావంతో నష్టపోయిన బాధితులను అన్ని విధాలా ఆదుకుంటామని ఈ సందర్భంగా సీఎం జగన్ తెలిపారు. బాలిరెడ్డిపాలెంలో తుపాను బాధిత గ్రామస్థులు, రైతులతో ఆయన ముఖాముఖి మాట్లాడారు. నష్టపోయిన ప్రతి రైతుకు పరిహారం చెల్లిస్తామని స్పష్టం చేశారు. ఈ గ్రామాల్లో దెబ్బతిన్న రోడ్లను పునరుద్ధరించే పనులు చేపడతామని, వారం రోజుల్లో అందరికీ న్యాయం చేస్తామని హామీ ఇచ్చారు. ప్రతి ఇంటికీ రూ.2,500 ఇస్తామని, పంట నష్టపోయిన రైతులకు పరిహారం అందిస్తామని అన్నారు. వర్షం వల్ల రంగు మారిన, తడిచిన ధాన్యాన్ని



కొనుగోలు చేస్తామని, అన్నదాతలు ఆందోళన చెందాల్సిన పని లేదని ధైర్యం చెప్పారు.తుపాను ప్రభావిత ప్రాంతాల్లో పర్యటన సందర్భంగా సీఎం జగన్ బాధితుల్లో ధైర్యం నింపారు. 'నాలుగైదు రోజుల్లో భారీ వర్షం కురిసింది. మనకు వచ్చిన కష్టం వర్ణనాతీతం. వరుస వర్షాలతో రైతులు నష్టపోయారు. 92 రిలీఫ్ కేంద్రాలు పెట్టాం. 60 వేల మంది బాధితులకు 25 కేజీల రేషన్ బియ్యంతో పాటు నిత్యావసరాలను పంపిణీ చేశాం. దేశంలో ఎక్కడా లేని విధంగా మన వద్ద వాలంటీర్ వ్యవస్థ ఉంది. ప్రతి ఇంటికీ వాలంటీర్ వచ్చి రూ.2,500 ఇస్తారు. పంట నష్టపోయిన రైతులను ఆదుకుంటాం. వారికి 80 శాతం సబ్సిడీతో విత్తనాలు అందిస్తాం. యుద్ధ ప్రాతిపదకిన విద్యుత్ సరఫరా పునరుద్ధరిస్తున్నాం. స్వర్ణముఖి నదిపై హైలెవల్ వంతెన నిర్మిస్తాం. అవసరమైన వారు జగనన్న హెల్ప్ లైన్ ను సంప్రదించాలి. వారం రోజుల్లో సమస్యలు పరిష్కరిస్తాం' అని సీఎం జగన్ వివరించారు.

# వరద బాధిత ప్రాంతాల్లో బాబు పర్యటన



**ప్రతీ రైతన్నకు అండగా నిలబడతాం...**
**తుపాన్ బాధితులను ఆదుకోవడంలో సర్కార్ వైఫల్యం**
**రానున్న ఎన్నికల్లో ఎగిరేది టిడిపి జెండాయే...**
**అధికారంలోకి రాగానే ప్రతీ పేదోడి కన్నీటి బొట్టు తుడుస్తాం**

అమరావతి డిసెంబర్ 8 దాదాపు మూడు నెలల తరువాత టీడీపీ అధినేత చంద్రబాబు ప్రజల మధ్యకు వచ్చారు. వరదలతో దెబ్బ తిన్న ప్రాంతాలను సందర్శించారు. రైతులకు భరోసా ఇచ్చారు. ఏపీ ప్రభుత్వం స్పందించ లేద ని మండిపడ్డారు.ఇదే సమయంలో తెలంగాణ ఎన్నికల పైనా చంద్రబాబు కీలక వ్యాఖ్యలు చేసారు. అహంకారం తో విర్రవీగితే ఏమవుతుందో తెలంగాణలో చూసామని వ్యాఖ్యానించారు. తన అరెస్ట్ తో జగన్ లో భయం మొదలైందని చెప్పుకొచ్చారు.అహంకారంతోనే ఓటమి : తెలంగాణ ఎన్నికల పైన చంద్రబాబు తొలి సారి స్పందించారు. ఎన్నికల ఫలితాలు వచ్చినా..ఇప్పటి వరకు ఎక్కడా చంద్రబాబు తన అభిప్రాయం వెల్లడించలేదు. రేవంత్ రెడ్డి తెలంగాణ ముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకారానికి ఆహ్వానించినా హాజరు కాలేదు. ట్వీట్ ద్వారా శుభాకాంక్షలు తెలిపారు. చంద్రబాబు హాజరు కాకపోవటం పైన భిన్నాభిప్రాయాలు వ్యక్తం అయ్యాయి. ఇక, తొలిసారి చంద్రబాబు తెలంగాణ ఎన్నికల ఫలితాల పైన స్పందించారు. ఏపీలో జగన్ ప్రభుత్వం అహంకారంతో ఉందని.. అహంకారం ఉంటే ఏమౌతుందనేది తెలంగాణలో చూశామన్నారు. మరో మూడు నెలల తర్వాత ఏపీలో తెలంగాణ పరిస్థితే అంటూ చంద్రబాబు పేర్కొన్నారు.**రైతులకు పరామర్శ** : తెనాలి నియోజకవర్గ పరిధిలో భారీ వర్షాలు..వరదల కారణంగా దెబ్బతిన్న పంట పొలాలను చంద్రబాబు పరిశీలించారు. పొలాల్లోకి దిగి నీట మునిగిన చేనును స్వయంగా పరిశీలించారు

### రెండు చోట్ల విరిగిన తుంటి ఎముక. నేడు సర్జరీ..

హైదరాబాద్ డిసెంబర్ 08 : బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ కు తుంటి ఎముక విరిగిన సంగతి తెలిసిందే. ఫామ్ హౌస్ లోని బాత్రూమ్ లో ఆయన పట్టుతప్పి కాలుజారి పడ్డారు. ప్రస్తుతం ఆయన సోమాజిగూడలోని యశోద ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నా రు.కేసీఆర్ తుంటి ఎముక రెండు చోట్ల విరిగినట్టు వైద్యులు గుర్తిం చారు. నేడు ఆయనకు ఆపరేషన్ నిర్వహించనున్నారు. తుంటి ఎముకకు స్టీల్ ప్లేట్లు అమర్చనున్నారు..

# అధిక ఫీజులు వసూలు చేస్తున్న ప్రైవేట్ డిగ్రీ కాలేజ్ లపై చర్యలు తీసుకోవాలి...

డోన్ :- డిసెంబర్ 8 డోన్ పట్టణంలో ఉన్న డిగ్రీ కళాశాలలో చదివే విద్యార్థుల నుండి ప్రభుత్వం పరీక్షలకు కట్టవలసిన ఫీజులు కంటే నోటిఫికేషన్ కన్నా అధికంగా ఫీజులను వసూలు చేస్తున్నారని ఎన్.ఎస్ యు.ఐ.జిల్లా నాయకులు తెలుగు విజయకుమార్ తెలిపారు. ఈ సమావేశంలో ఆయన మాట్లాడుతూ చదువులను ఆసరాగా చేసుకొని డిగ్రీ కళాశాల యజమాన్యాలు విద్యార్థులతో ఫీజులు ఎక్కువగా వసూలు చేస్తున్నారాని ఇదే కాక చివరికి పరీక్ష ఫీజులలో కూడా జాప్యం



తలపెట్టి 800 నుండి 1000 రూపాయల వరకు వసూలు చేస్తున్న పట్టించుకోనే అధికారులే లేరని దీనికి కారణం రాయలసీమ యూనివర్సిటీ వి.సి ఈ ప్రైవేట్ కళాశాల వైపు ఇంతవరకు తొంగి చూడకుండా చర్యలు తీసుకోకపోవడం కారణమని ఇకనైనా రాయలసీమ యూనివర్సిటీ వి.సీ తక్షణం స్పందించి ఈ కళాశాలపై చర్యలు తీసుకొని విద్యార్థుల యొక్క చదువులకు బాసటగా నిలిచేలా చూడాలని వారు కోరారు.

# వైయస్ ఆర్ నగరంలో ఉర్దూ కళాశాల మరియు హాస్టళ్ కు భూమి పూజ



---విభారె న్యూస్ నంద్యాల మా ప్రతినిధి డిసెంబర్ 08- వైయస్ ఆర్ నగరంలో శుక్రవారం 12 కోట్ల రూపాయల వ్యయంతో 6నూతన ఉర్దూ జూనియర్ కళాశాల, వసతిగృహం, వర్కింగ్ ఉమెన్స్ హాస్టల్, సద్భవన్ బిల్డింగ్, ప్రీ మెట్రిక్, పోస్ట్ మెట్రిక్ బాయ్స్ అండ్ గర్ల్స్ నూతన భవనాల నిర్మాణానికి ఎమ్మెల్యే, ఎంపీ, ఎమ్మెల్సీ, కలెక్టర్, జేసీ ఛైర్ పర్సన్ మాబున్నిసా. నౌమాన్ . తదితరులు భూమి పూజ నిర్వహించారు . నంద్యాల పట్టణంలో అత్యధిక శాతం ఉన్న ముస్లిం మైనార్టీల అభ్యున్నతికి వైఎస్ఆర్సిపి ప్రభుత్వం పెద్దపీట వేస్తున్నదని నంద్యాల శాసనసభ్యులు కిషోర్ రెడ్డి పేర్కొన్నారు. . నంద్యాలలో చేపట్టిన అనేక అభివృద్ధిలో భాగంగా ప్రధానంగా ముస్లిం మైనార్టీ విద్యార్థుల ఉజ్వల భవిష్యత్తుకు నంద్యాల పట్టణంలోని వైయస్సార్ నగర్ ప్రాంతంలో 4.5 ఎకరాల స్థలంలో 12 కోట్ల రూపాయల వ్యయంతో భవనాలను నిర్మించేందుకు నేడు భూమి పూజ చేయడం సంతోషంగా ఉందన్నారు.. ఈ కార్యక్రమంలో నంద్యాల డిస్ట్రిక్ట్ మైనారిటీ వెల్ఫేర్ ఆఫీసర్ సిబిహ పర్వీన్, , డైరెక్టర్ కాజీ అబ్దుల్ కలాం మున్సిపల్ వైస్ చైర్మన్ పామ్ షావలి, కౌన్సిలర్ సావిత్రమ్మ. వార్డు ఇంచార్జి రమణ , మున్సిపల్ కౌన్సిలర్స్ కోఆప్షన్ సభ్యులు వార్డు ఇన్చార్జిలు వైఎస్ఆర్సిపి మైనార్టీ నాయకులు పాల్గొన్నారు.

# పోలీసు సమస్యల పరిష్కారమే గ్రీవియన్స్ డే

### నంద్యాల జిల్లా ఎస్పీ కె . రఘువీర్ రెడ్డి

విభారె న్యూస్ నంద్యాల మా ప్రతినిధి డిసెంబర్ 08 - .పోలీసు సిబ్బంది సమస్యల పరిష్కారం కొరకు శుక్రవారం నంద్యాల జిల్లా ఎస్పీ కె.రఘువీర్ రెడ్డి జిల్లా పోలీసు కార్యాలయంలో పోలీసు గ్రీవియన్స్ డే నిర్వహించారు. జిలా లో వివిధ పోలీసు స్టేషన్లు ఆయా విభాగాలలో విధులు నిర్వర్తిస్తున్న 04 పోలీసు సిబ్బంది వారి మ్యూచువల్ ట్రాన్స్ఫర్, మెడికల్ (గ్రౌండ్స్), రిక్వెస్ట్ బదిలీల గురించి జిల్లా ఎస్పీ గారికి స్వయంగా విన్నవించుకున్నారు. జిల్లా ఎస్పీ




గారు సిబ్బంది సమస్యలను విని, వారి సమస్యలకు తగిన పరిష్కారం చూపుతామని సిబ్బందికి భరోసా కల్పించారు., శుక్రవారం నిర్వహించే పోలీస్ వెల్ఫేర్ డే కార్యక్రమంలో సిబ్బంది వారి సమస్యలను నిర్భయంగా తెలియజేసుకోవచ్చని జిల్లా ఎస్పీ గారు తెలిపారు. ఈ కార్యాక్రమంలో జిల్లా ఎస్పీ గారితో పాటు ఎస్పీ సీసీ నాగరాజు పాల్గొన్నారు

# సంపాదకీయం

శనివారం 09-12-2023

## పెరుగుతున్న వంటింటి బిల్లు

రెండేళ్లుగా పేద, మధ్య తరగతి వర్గాలను ఎవర్ని కదిలించినా, పది మాటల్లో కనీసం రెండు మూడైనా పెరిగిన ధరల గురించే ఉంటున్నాయి. పెట్రోల్, వంట నూనె, కరెంట్ బిల్, పాల ప్యాకెట్.. వస్తువు ఏదైనా పెరుగుదల అనే పాయింట్ మాత్రం కామన్. తినడమూ, ఖర్చు పెట్టడమూ మానలేము. మన దేశంలో సామాన్యుడి భోజనం బిల్లు మళ్లీ పెరిగింది, ముద్ద మింగుడు పడడం లేదు. పెరుగుతున్న కూరగాయల రేట్లతో ఇటు శాఖాహారం, అటు మాంసాహారం రెండిటి బడ్జెట్ మారింది. నాన్-వెజ్ వండాలంటే టమాటాలు, ఉల్లిపాయలు, బంగాళాదుంపలు, మిర్చి, కొత్తిమీర వంటి వెజిటేరియన్ పదార్థాలు ఉండాలి. కాబట్టి, మాంసాహారం కోసం చేసే ఖర్చు కూడా పెరిగింది.క్రిసిల్ రోటీ రైస్ రేట్ ఇండెక్స్ ప్రకారం, గత నెలలో టమాటాలు, ఉల్లిపాయల ధరలు భారీగా పెరిగాయి. ద్రవ్యోల్బణం లాంటి పెద్ద పెద్ద మాటలు వాడకుండా, ఒక సామాన్య మధ్యతరగతి ఇల్లాలి దగ్గర కూర్చుని ధరల పెరుగుదల ఆమెను ఎలా ప్రభావితం చేసిందో తెలుసుకునే ప్రయత్నం చేశాం. రాజకీయ నాయకులు తరచూ మాట్లాడే, ధర్నాలు చేసే, గ్యాస్ సిలిండర్లు నెత్తిన పెట్టుకుని, ఎడ్ల బండిపై వెళుతూ చేసే ప్రదర్శనలన్నీ ఒకవైపు.. ఆర్టీసీ బస్సులో కూర్చునో, బైక్ పై వెళ్తూనో, షేర్ ఆటోలో నుంచి తొంగి చూసి ఆ ఆందోళనకు కారణం తెలుసుకుని నిట్టూర్చే మధ్య తరగతి, పేదలు మరోవైపు.క్రిసిల్ రీసెర్చ్ డేటాను బట్టి, గత నెలలో, ఇంట్లో వండే శాఖాహార వంటల బడ్జెట్ 10% పెరిగింది. అదే సమయంలో మాంసాహారం కోసం చేసే ఖర్చు 5% పెరిగింది. విడివిడిగా చూస్తే... నవంబర్ నెలలో ఉల్లిపాయల రేట్లు 93% పెరిగాయి, టొమాటో ధరలు 15% పెరిగాయి. ధరాఘాతం వల్ల... రోటీ, అన్నం, పప్పు, కూర, పెరుగుతో కూడిన సాధారణ శాఖాహార భోజనం తయారీ ఖర్చు గత సంవత్సరం నవంబర్ నెల కంటే ఈ సంవత్సరం నవంబర్ నెలలో 9% పెరిగింది. పప్పులది వెజ్ థాలీ ధరలో 9% వాటా. వీటి రేటు కూడా గత సంవత్సరం కంటే ఇప్పుడు 21% పెరిగాయి, భోజనం భారాన్ని పెంచాయి.నాన్-వెజ్ భోజనం తయారీ ఖర్చుది కూడా ఇదే పంథా. రోటీ, అన్నం, పప్పు బదులు చికెన్ (బ్రాయిలర్), పెరుగుతో కూడిన సాధారణ మాంసాహార భోజనం ఖర్చు గత సంవత్సరం కంటే ఈ సంవత్సరం పెరిగింది. అయితే, బ్రాయిలర్ చికెన్ రేట్లు తగ్గడం వల్ల, ఓవరాల్ రేటులో 5% పెరుగుదల మాత్రమే కనిపిస్తోంది. నాన్-వెజ్ థాలీ ధరలో బ్రాయిలర్ వాటా 50% ఉంటుంది. అందువల్లే, కూరగాయల రేట్లు పెరిగినా మాంసాహార ప్రియులకు ఉపశమనం దొరికింది. ఉల్లి, టమాటా ధరలు పెరగడానికి ప్రధాన కారణాలు రెండు. పండుగల సీజన్ కారణంగా డిమాండ్ పెరగడం, సరైన వర్షాలు లేక ఖరీఫ్ సీజన్‌లో ఉత్పత్తి తగ్గడం. ఈ ఏడాది జనవరి-మే కాలంలో ఉల్లి, టొమాటోల రేట్లు తగ్గాయి, జులై-ఆగస్టులో పెరిగాయి. ఆగస్టు నెలలో టమాటా రేట్లు చుక్కల్లోకి చేరాయి, సామాన్య జనానికి పట్టపగలే చుక్కలు చూపించాయి. టమాటా రేట్ల వల్ల ఆ నెలలో శాఖాహార భోజనం తయారీ ఖర్చు 24% పెరిగింది. అదే సమయంలో మాంసాహార భోజనం తయారీ ఖర్చు 13% పెరిగింది. ధరలు అంటే ఫస్ట్ చెప్పాల్సింది ఆయిల్. ఆయిల్ రేట్ 2019 ప్రాంతంలో 90 రూపాయలు సుమారుగా ఉండేది. తరువాత 120 అయింది. ఇప్పుడు 220 వరకూ పెరిగింది. అది మామూలు పెరుగుదల కాదు. అసలు వంట నూనె ఇంత భారీగా పెరగడం మాటలు కాదు. మూడేళ్ల క్రితం 75-80 రూపాయలు ఉండేది పెట్రోలు. ఇప్పుడు 110 అయింది. వాస్తవానికి 120 అయితే, మొన్నామధ్య పెంచి మళ్లీ 10 రూపాయలు తగ్గించారు కదా. అంటే ఏకంగా మూడేళ్లలో 30 రూపాయల పైన పెట్రోల్ పెరిగింది.

## వైసీపీ ప్రభుత్వంలో మహిళలకు భద్రత లేదు.... సుబ్బారెడ్డి

విభారే న్యూస్ డోన్ మా ప్రతినిధి :- డిసెంబర్ 8 బేతంచేర్ల పట్టణంలో 13వ వార్డు నందు బాబు షూరిటీ - భవిష్యత్తుకు గ్యారంటీ ప్రజావేదిక కార్యక్రమం వార్డు నాయకులు కౌన్సిలర్ నంద్యాల కుమారి, నంద్యాల మధు, రాష్ట్ర క్రిస్టియన్ సెల్ కమిటీ నాయకులు మేకల నాగరాజు, పట్టణ ఎస్సీ సెల్ అధ్యక్షులు గూటం శివ అధ్వర్యంలో బేతంచేర్ల పట్టణ టిడిపి ప్రధాన కార్యదర్శి షేక్షావలి చౌదరి అధ్యక్షతన శుక్రవారం నిర్వహించిన ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథులుగా డోన్ నియోజకవర్గ టిడిపి ఎమ్మెల్యే అభ్యర్థి ధర్మవరం మన్నే సుబ్బారెడ్డి సతీమణి మల్లీశ్వరమ్మ హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో ధర్మవరం మన్నే సుబ్బారెడ్డి ప్రజావేదిక అనంతరం ఇంటింటికి తిరుగుతూ భవిష్యత్తుకు గ్యారంటీ కార్యక్రమంలో పథకాల గురించి వివరిస్తూ, ప్రజల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అదేవిధంగా ప్రజలు త్రాగునీటి, డ్రైనేజీ సమస్య ఎక్కువగా ఉందని అధికార పార్టీ నాయకులు పట్టించుకోవడం లేదని ప్రజలు తెలిపారని అన్నారు. నేడు నిత్యావసర ధరలు పెరగడంతో సామాన్యునికి జీవనం భారంగా మారిందని, గత





తెలుగుదేశంపార్టీ ప్రభుత్వం లో ఇసుక ఉచితంగా దొరికేది అని, ఈ వైసిపి ప్రభుత్వంలో ఇసుక బంగారవ్వడంతో పేదోడి ఇంటి కళ, కళగానే మిగిలిందని, మహిళలకు భద్రత లేకుండా పోయిందని అన్నారు. కాబట్టి మనం మన భవిష్యత్తును దృష్టిలో పెట్టుకొని తెలుగుదేశంపార్టీని గెలిపించుకోవాలని అన్నారు. ఈ కార్యక్రమంలో నంద్యాల జిల్లా టిడిపి ఎస్సీ సెల్ అధికార ప్రతినిధి రూబెన్, రాష్ట్ర ఎస్టీ సెల్ కమిటీ నాయకులు రవీంద్ర నాయక్, కౌన్సిలర్ రామగోపాల్, అడ్వకేట్ హారుణ్, నారాయణ స్వామి, జగదీష్, విజయ్, రాజు తదితరులు పాల్గొన్నారు.

## బీసీల వెన్ను విరుస్తున్నా జగన్ రెడ్డి. బీసీల బాంధవుడు చంద్రన్నే...




విభారే న్యూస్ డోన్ మా ప్రతినిధి :- డిసెంబర్ 8 రాష్ట్ర తెలుగుదేశంపార్టీ ఆదేశాల మేరకు జగన్ రెడ్డి ప్రభుత్వంలో బీసీల పై జరుగిన హత్యలు , జరుగుతున్న దాడులు, దౌర్జన్యాలు అన్యాయాలపై డోన్ పట్టణంలో తెలుగుదేశంపార్టీ కార్యాలయం నందు నంద్యాల జిల్లా టిడిపి బీసీ సెల్ అధ్యక్షులు ప్రజావైద్యశాల బెస్తా మల్లిఖార్జున ఆధ్వర్యంలో బుక్ లెట్ ను విడుదల చేసిన డోన్ నియోజకవర్గ టిడిపి ఎమ్మెల్యే అభ్యర్థి ధర్మవరం మన్నే సుబ్బారెడ్డి మరియు రాష్ట్ర తెలుగుదేశంపార్టీ కార్యదర్శి వలసల రామకృష్ణ ధర్మవరం మన్నే సుబ్బారెడ్డి మాట్లాడుతూ ముఖ్యమంత్రి జగన్ రెడ్డి రూ. 75,760 కోట్లు బీసీ సబ్ ప్లాన్ నిధులు దారి మళ్లించారని. ఆదరణ లాంటి 30కి పైగా బీసీ సంక్షేమ పథకాలు రద్దు చేశారని అన్నారు. 70వేలకు పైగా బీసీ బ్యాక్ లాగ్ పోస్టులు భర్తీ చేయలేదని, 74మంది బీసీ లను హత్యలు, వేల మంది పై తప్పుడు కేసులు, దాడులు చేసి వేధించారని అన్నారు. 56 కార్పొరేషన్ లను ఏర్పాటు చేసి ఉత్సవ విగ్రహాలుగా చేశారు. బీసీ లకు వెన్నుదన్నుగా ఎన్టీఆర్ - చంద్రన్న అని 34% రిజర్వేషన్ లను అమలు చేశారని, సంక్షేమ పథకాలకు అదనంగా సబ్ ప్లాన్ ద్వారా 36,475 కోట్లు ఖర్చు, 4.20 లక్షల మందికి ఆదరణ పరికరాలు , కార్పొరేషన్ ద్వారా 3700 కోట్లు ఖర్చు ఇలా ఎన్నో బీసీల ఎదుగుదలకు కృషి చేసింది చంద్రన్నే అని , కాబట్టి బీసీ ల బాంధవుడు చంద్రన్నే అని అన్నారు. ఈ కార్యక్రమంలో నంద్యాల జిల్లా టిడిపి కోఆర్డినేటర్ తిరుపాల్ బాబు, డోన్ మండలం టిడిపి అధ్యక్షులు నలీంద్ర శ్రీనివాసులు యాదవ్, ప్యాపిలి మండలం టిడిపి అధ్యక్షులు గండికోట రామసుబ్బయ్య, నంద్యాల జిల్లా టిడిపి రైతు కమిటీ ఉపాధ్యక్షులు సత్యం,క్లస్టర్ ఇంచార్జ్ గోవిందు, డోన్ పట్టణ టిడిపి బీసీ సెల్ అధ్యక్షులు చక్రపాణి గౌడ్ మరియు డోన్ నియోజకవర్గంలోని బీసీ కమిటీ నాయకులు పాల్గొన్నారు.

## బడి ఈడు పిల్లలు బడిలోనే ఉండాలి...






విభారే న్యూస్ మా ప్రతినిధి :- డిసెంబర్ 8 శుక్రవారం డోన్ పట్టణం పాతపేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల యందు ప్రధానోపాధ్యాయులు వెంకట సుబ్బారెడ్డి అధ్యక్షతన ఉపాధ్యాయులకు 100% జిఈఆర్ సాధించాలని, ఎవరైనా లాంగ్ ఆబ్సెంట్లతో ఉండి బడికి రాక పోయినా, డ్రాపౌట్స్ అయిన పిల్లల తల్లిదండ్రులను కలిసి బడిలో చేర్పించాలని,5నుండి 18సంవత్సరాల పిల్లలందరూ బడిలో ఉండాలని పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా పాఠశాలకు గత 4నెలలుగా బడికి రాని పిల్లలను వాలంటీర్లు పిలుచు కొని వచ్చి బడిలో చేర్పించారు. ఆయా వాలంటీర్లను అభినందించారు. ఈ కార్యక్రమంలో సీనియర్ ఉపాధ్యాయులు సుబ్బారెడ్డి, శివప్రసాద్, వెంకటరమణ, లక్ష్మయ్య, రవిశేఖర్, బాబు, సుబాన్, సంజీవరెడ్డి, రమేష్, దేవేంద్రప్ప, భాను ప్రకాష్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## నరసప్ప మృతి టిడిపికి తీరని లోటు

కౌతాళం మండలం (విభారె న్యూస్ డిసెంబర్-8) : కౌతాళం మండలంలో మరళి గ్రామ తెలుగుదేశం పార్టీ కార్యకర్త బారికి నరసన్న అనారోగ్యంతో శుక్రవారం మృతి చెందారు. విషయం తెలుసుకున్న మంత్రాలయం టిడిపి సీనియర్ నాయకులు ఉలిగయ్య సోదరుడు సిద్దయ్య మృతదేహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. నాటక రంగంలో అందరితో స్నేహపూర్వకంగా మెలుగుతూ తనదైన ముద్ర వేసుకున్న టిడిపి కార్యకర్తను కోల్పోవడం చాలా



బాధాకరమన్నారు. నరసయ్య మృతి టిడిపికి తీరని లోటు అని అన్నారు.

## బోగస్ ఓట్ల తొలగింపుపై జిల్లా కలెక్టర్ కు వినతి పత్రం అందజేసిన ఎంపీ, ఎమ్మెల్యేలు



విభారె న్యూస్ నంద్యాల మా ప్రతినిధి డిసెంబర్ 08 - నంద్యాల జిల్లా పరిదిలో ఉన్న బోగస్ ఓట్లను మరోమారు పరిశీలించి తొలగించాలని కోరుతూ శుక్రవారం వైఎస్సార్సీపీ నంద్యాల జిల్లా అధ్యక్షుడు, పాణ్యం ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్ రెడ్డి అధ్వర్యంలో ఎంపీ పోచ బ్రహ్మానందరెడ్డి, ఎమ్మెల్యే శిల్పా రవి రెడ్డి , ఎమ్మెల్సీ ఇసాక్ బాష కలసి జిల్లా కలెక్టర్ డా. మనజీర్ జిలానీ సమున్ కు వినతి పత్రాన్ని అందజేశారు. ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్ రెడ్డి మాట్లాడుతూ... టీడీపీ నేతలు తమపై బురద జల్లే ప్రయత్నం చేస్తున్నారని, బోగస్ ఓట్లను తాము చేర్పిస్తున్నామని అసత్య ప్రచారం చేస్తున్నారన్నారు. సీఎం జగన్ మోహన్ రెడ్డి సూచన మేరకు జిల్లాలో ఓటర్ జాబితా నుంచి బోగస్ ఓట్లను అధికారులు పరిశీలించి తొలగించాలని కోరామన్నారు. పారదర్శకంగా , స్వచ్ఛీకరణ ఓటరు జాబితా తయారు చేయాలని జిల్లా కలెక్టర్ ను కోరామన్నారు.

## వెల్దుర్తి మండలంలో...వికసిత భారత్ సంకల్పయాత్ర



విభారె న్యూస్ డిసెంబర్ 08 కర్నూలు ..వికసిత భారత్ సంకల్ప యాత్ర కర్నూలు జిల్లా పత్తికొండ అసెంబ్లీ వెల్దుర్తి మండలం గోవర్ధనగిరి వెల్దుర్తి గ్రామాలలో జరిగిన ఈ కార్యక్రమంలో ఎంపీడీవో నరసిం హులు స్థానిక సర్పంచులు సుశీల జడ్పీటిసి సుంకన్న గ్రామ కార్యదర్శిలు వెంకట్ నాయక్ నాగేశ్వరావు ఆయుష్మాన్ భారత్ హోమియోపతి డాక్టర్ భారతి బ్యాంక్ మేనేజర్లు ప్రకాష్ రావు సత్యనారాయణ తదితర అధికారులు వేల్పులగోపాల్ సమావేశంలో మాట్లాడుతూ భారత ప్రధానమంత్రి నరేంద్రమోడీ ప్రవేశపెట్టారు ఆయుష్మన్ భారత్ ఆరోగ్య, సంరక్షణ కేంద్రం పియం కిషాన్ యోజన పథకం ద్వార రైతులకు పలు పథకాలను వివరించారు ఈ కార్యక్రమంలో రాష్ట్రనాయకులు చంద్రమౌళి జిల్లా ప్రధానకార్యదర్శి కోటియాదవ్ మండల అధ్యక్షుడు రామనాయుడు వెంకటేశ్వరరెడ్డి షేక్షావలి నాగమద్దిలేటి గులాంభాష రాము ఈశ్వరప్ప మహేశ్వరి లలితాబాయ్ శాంతి మహేష్ తిరుపాలు ఇమామ్ కాసిం తదితరులు పాల్గొన్నారు.

## రేపు కౌతాళంలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం.

కౌతాళం మండలం (విభారే న్యూస్ డిసెంబర్-8) : కౌతాళం మండలం గ్రామ సచివాలయం-1 పరిధిలో రేపు అనగా శనివారం ఎమ్మెల్యే బాలనాగిరెడ్డి గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించనున్నట్లు వైసిపి మండల కన్వీనర్ ప్రహల్లాద స్వామి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు కావున మండలం లోని వైసీపీ నాయకులు, కార్యకర్తలు, ప్రజా ప్రతినిధులు, అధికారులు, సచివాలయ సిబ్బంది, వాలంటీర్లు, తప్పనిసరి హాజరు కావాలని కోరారు.



# ఏపీలో డ్యూయల్ ఓటు రచ్చ

విజయవాడ, డిసెంబర్ 8, తెలుగు రాష్ట్రాల్లో ఓటు హక్కు కలిగి ఉన్న వారి వ్యవహారం ఇప్పుడు ఏపీలో రాజకీయ అంశంగా మారింది. ఆంధ్రప్రదేశ్ స్థానికత కలిగి ఉన్న వారికి స్వస్థలంతో పాటు ఉద్యోగం, ఉపాధి, విద్యాభ్యాసం కోసం తెలంగాణలో స్థిరపడిన ప్రదేశంలో కూడా ఓటు హక్కును పొందారు. ఇలా ఏపీ స్థానికత కలిగిన వారిలో ఎందరికి తెలంగాణలో ఓటు హక్కు ఉందనే విషయంలో అధికారిక లెక్క లేకపోయినా రకరకాల అంచనాలు మాత్రం ఉన్నాయి. 2018లోనే ఈ అంశం తెరపైకి వచ్చినా అప్పట్లో ఎన్నికల సంఘం ఈ అంశాన్ని చూసి చూడనట్టు వ్యవహరించింది. 2018 చివరిలో తెలంగాణ అసెంబ్లీకి ముందస్తు ఎన్నికలు జరిగాయి. 2014లో రాష్ట్ర విభజన జరిగిన తర్వాత కూడా ఉమ్మడి రాష్ట్రంలోనే సాధారణ ఎన్నికలు జరిగాయి. భౌగోళిక సరిహద్దులు, నియోజక వర్గాల ఆధారంగా రెండు రాష్ట్రాలకు ఫలితాలను వెల్లడించారు. 2018లో మాత్రం ఆర్నెల్ల ముందే తెలంగాణలో కేసీఆర్ ప్రభుత్వాన్ని రద్దు చేశారు. 2018 ఎన్నికల నాటికి తెలంగాణలో దాదాపు 30లక్షల మంది ఆంధ్రా స్థానికత కలిగిన వారు ఉంటారని అంచనాలు ఉన్నాయి. వారిలో 8 నుంచి 12లక్షల మందికి తెలంగాణతో పాటు ఏపీలో కూడా ఓటు హక్కు ఉందని పలు రాజకీయ పార్టీలు ఎన్నికల సంఘానికి ఫిర్యాదులు చేశాయి. అయితే ఈ అంశానికి పెద్దగా ప్రాధాన్యత లభించలేదు. తెలంగాణ అసెంబ్లీ ఎన్నికలు ముగిసిన తర్వాత రెండు రాష్ట్రాల్లో ఓటు హక్కు ఉండటంపై పార్టీలు అభ్యంతరం తెలిపాయి. ఇది ఫలితాలను తారుమారు చేసే స్థాయిలో ఉందని ఆందోళన వ్యక్తం చేసినా ఈసీ చేతులెత్తేసింది. రెండు తెలుగు రాష్ట్రాల్లో ఒకే సారి ఎన్నికలు జరగవు కాబట్టి పెద్దగా నష్టం ఉండదని అప్పట్లో ఏపీలో ఎన్నికల సంఘం ప్రధాన అధికారిగా పనిచేసిన గోపాల కృష్ణ ద్వివేది వివరణ ఇచ్చారు. ఓటు హక్కును నిరాకరించడానికి సహేతుకమైన కారణాలు ఉండాలని పేర్కొన్నారు. తెలంగాణ అసెంబ్లీ ఎన్నికల తర్వాత ఏపీలో మళ్లీ ఓట్ల విషయంలో మళ్లీ అలజడి మొదలైంది. గత కొద్ది రోజులుగా అధికార పార్టీ నేతలు ఎన్నికల సంఘం చుట్టూ ప్రదక్షణలు చేస్తున్నారు. ప్రస్తుతం తెలంగాణలో ఆంధ్రప్రదేశ్ స్థానికత కలిగిన 40లక్షల మంది నివసిస్తున్నారనే అంచనాలు ఉన్నాయి. వీరిలో ఎక్కువ మంది హైదరాబాద్‌లో నివసిస్తున్నారు. దాదాపు పది లక్షల మందికి ఏపీలో ఓటు ఉంటుందని అనుమానిస్తున్నారు. డిసెంబర్ చివరి నాటికి దేశవ్యాప్తంగా ముసాయిదా ఓటర్ల జాబితాను ప్రకటించాల్సి ఉండటంతో రాజకీయ పార్టీలు ఓట్ల తొలగింపుకు హడావుడి మొదలుపెట్టాయి. పార్లమెంటు ఎన్నికలతో పాటు ఏపీ అసెంబ్లీ ఎన్నికలు కూడా మార్చి, ఏప్రిల్ నెలల్లో జరగాల్సి ఉంది. ముసాయిదా ఓటర్ల జాబితా ప్రకటనకు ముందే రెండు చోట్ల ఓటు హక్కు ఉన్న వారిని గుర్తించి తొలగించాలని అధికార వైసీపీ డిమాండ్ చేస్తోంది. అసెంబ్లీ ఎన్నికల నాటికి హైదరాబాద్‌లో ఉన్న ఆంధ్ర ఓటర్లు ఏపీలో ఓటు హక్కును వినియోగించు కోడానికి వస్తారని ఆ పార్టీ అనుమానిస్తోంది. నవంబర్ 30వ తేదీ నాటికి తెలంగాణ ఓటర్ల జాబితాలో ఓటు హక్కు ఉన్న వారిని ఏపీలో జరిగే ఎన్నికల్లో ఓటు వేయకుండా చూడాలని ఈసీకి ఫిర్యాదు చేసింది. జాబితాలో ఉన్నా, స్థానికంగా నివసించని వారి ఓటును ఎప్పటికప్పుడు తొలగించాల్సి ఉన్నా రకరకాల కారణాలతో బిఎల్వోలు తొలగించకుండా వదిలేస్తున్నారు. ఉపాధి కోసం వేర్వేరు ప్రాంతాలకు వెళ్లిపోయిన ఓట్లను స్థానికంగానే కొనసాగించడంపై రకరకాల ఒత్తిళ్లు ఉంటున్నాయి. స్థానిక నేతల ఒత్తిడితో పాటు ఓటర్ల వినతులతో వాటిని కొనసాగిస్తున్నారు. ఇతర ప్రాంతాల్లో స?థానికత ధృవీకరణ కోసం ఓటు హక్కు కోసం దరఖాస్తు చేసుకుంటున్నారు. తెలుగు రాష్ట్రాలకు చెందిన ఓటర్లు దేశంలోని అన్ని ప్రాంతాల్లో ఉంటున్నా మిగిలిన రాష్ట్రాలతో పెద్దగా సమస్య లేదని ఎన్నికల సంఘం చెబుతోంది. ప్రధానంగా ఆంధ్రా ఓటర్లకు తెలంగాణలో పెద్ద సంఖ్యలో ఓటు ఉండటమే సమస్యగా మారుతోందని అధికారులు చెబుతున్నారు. తెలంగాణలో ఓటు వేసిన వారిని తిరిగి ఆంధ్రప్రదేశ్ లో ఓటు వేయకుండా చూడాలని ఫిర్యాదులు అందడంతో దానిపై ఏమి చేయాలనే దానిపై మల్లగుల్లాలు పడుతున్నారు. తెలంగాణాలో ఓటు వేసిన వారిని తిరిగి  ఒదించారు. మంత్రులు చెల్లుబోయిన వేణు గోపాలకృష్ణ, జోగి రమేష్ , శాసనమండలిలో విప్ లేళ్ళ అప్పిరెడ్డి, పార్లమెంట్ సభ్యులు గురుమూర్తి సీఈఓ మీనాను కలసి ఫిర్యాదు చేశారు.

# కులగణన మళ్లీ వాయిదా

విజయవాడ, డిసెంబర్ 8, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా తీసుకున్న సమగ్ర కులగణన ప్రక్రియ మరోసారి వాయిదా వేసింది. ముందుగా నవంబర్ 27వ తేదీ నుంచి కులగణన ప్రక్రియను చేపట్టాలని ప్రభుత్వం నిర్ణయించింది. దీనికి సంబంధించి అన్ని రకాల ఏర్పాట్లు కూడా పూర్తి చేసింది. గ్రామ, వార్డు సచివాలయ ఉద్యోగులతో పూర్తిగా డిజిటల్ విధానంలో ప్రక్రియ చేపట్టేలా ఏర్పాట్లు చేశారు. ప్రత్యేక యాప్ ద్వారా డోర్ టు డోర్ సర్వే చేపట్టాలని ప్రభుత్వం గైడ్ లైన్స్ కూడా జారీ చేసింది. కులగణన ఎలా చేపట్టాలి? ఇంటింటికీ వెళ్ళినప్పుడు ఎలాంటి ప్రశ్నలు అడగాలి? వంటి అంశాలపై అధికారులు, సిబ్బందికి శిక్షణ కూడా ఇచ్చారు. గ్రామ, వార్డు సచివాలయాల సిబ్బంది, వాలంటీర్లు ఆధ్వర్యంలో కులగణన జరిగేలా అంతా సిద్ధం చేశారు. మరోవైపు కులసంఘాల, నిపుణులతో జిల్లావారీగాను, ప్రాంతీయ సమావేశాలు కూడా నిర్వహించారు. విశాఖపట్నం, రాజమండ్రి, విజయవాడ, కర్నూల్, తిరుపతిలో ప్రాంతీయ సమావేశాలు పూర్తయ్యాయి. మరోవైపు పైలెట్ ప్రాజెక్టుగా ఐదు సచివాలయాల పరిధిలో సర్వే కూడా విజయవంతంగా పూర్తి చేశారు. అన్ని ఏర్పాట్లు పూర్తయిన తర్వాత ప్రభుత్వం కులగణన వాయిదా వేసింది. అన్ని ఏర్పాట్లు పూర్తయిన తర్వాత చివరి నిమిషంలో కులగణన ప్రక్రియ డిసెంబర్ 9కి వాయిదా వేస్తున్నట్లు మంత్రి చెల్లుబోయిన వేణుగోపాల్ ప్రకటించారు. దీనికి కారణాలు కూడా చెప్పుకొచ్చారు. కుల సంఘాలు, నిపుణులతో ప్రాంతీయ, జిల్లాస్థాయి సమావేశాల్లో అనేక అభిప్రాయాలు తీసుకున్నామని, మరింత పక్కాగా చేపట్టేలా మండల స్థాయిలో సమావేశాలు నిర్వహిస్తామని మంత్రి చెప్పారు. ఈ సమావేశాల ద్వారా వచ్చే అభిప్రాయాల మేరకు సర్వే చేస్తామని చెప్పారు. ఈ నెల 9 నుంచి ప్రారంభం కావాల్సిన సర్వేను తాజాగా మరోసారి వాయిదా వేస్తున్నట్లు ప్రకటించారు. కొత్త తేదీ మాత్రం ఎప్పుడనేది చెప్పలేదు. వాస్తవంగా నవంబర్ 27 వ తేదీ నుంచి కులగణన ప్రక్రియ ప్రారంభం కావాల్సి ఉంది. అది కాస్తా డిసెంబర్ 9 వ తేదీకి వాయిదా పడింది. తాజాగా మరోసారి సర్వే ను వాయిదా వేసింది సర్కార్. దేశంలో బీహార్ తర్వాత ఆంధ్రప్రదేశ్ మాత్రమే కులగణన చేయాలని నిర్ణయించింది. దీనికోసం ఆరుగురు అధికారుల కమిటీని నియమించింది.. కమిటీ బీహార్ లో పర్యటించి అక్కడ కులగణన జరిగిన విధానంపై ప్రభుత్వానికి నివేదిక ఇచ్చింది. కమిటీ నివేదిక ఆధారంగా కేబినెట్ కూడా కులగణన చేపట్టేందుకు ఆమోద ముద్ర వేసింది. కేబినెట్ నిర్ణయం తర్వాత ప్రక్రియను వేగవంతం చేసింది. మిచౌంగ్ తుఫాన్ కారణంగా కులగణన వాయిదా వేశామని బీసీ సంక్షేమ శాఖ మంత్రి వేణుగోపాల్ చెప్పారు. తుఫాన్ కారణంగా జరిగిన పంటనష్టం పై అధికార యంత్రానంగం నిమగ్నమై ఉందని, ఈ సమయంలో తుపాన్ నష్టం, రైతులను ఆదుకోవాల్సిన అవసరం ఉందని మంత్రి వేణుగోపాల్ అన్నారు. కేవలం తుఫాన్ కారణంగానే వాయిదా వేశాం తప్ప వేరే కారణాలు లేవన్నారు. రాష్ట్రంలో వాతావరణ పరిస్థితులు కుదుటపడిన తర్వాత త్వరలో కులగణన తేదీని ప్రకటిస్తామన్నారు. సర్వేకు సంబంధించి అన్ని ఏర్పాట్లు ఇప్పటికే పూర్తి కావడంతో ఆలస్యంగా ప్రక్రియ ప్రారంభించినా వారం రోజుల్లోగా పూర్తి చేస్తామని ప్రభుత్వం చెబుతుంది

# 17 నుంచి తిరుప్పావై...

తిరుమల, డిసెంబర్ 8, తిరుమల వెంకటేశ్వర స్వామి ఆలయంలో నెల రోజులపాటు సుప్రభాతం కాకుండా తిరుప్పావై జరగనుంది. డిసెంబరు 17 నుంచి జనవరి 14 వరకు ధనుర్మాసం కావడంతో సుప్రభాతం స్థానంలో తిరుప్పావై సేవ జరగనుంది. తిరుమల శ్రీ వెంకటేశ్వరస్వామి మాసోత్సవాల్లో అత్యంత ముఖ్యమైనదిగా భావించే ధనుర్మాసం డిసెంబరు 17 తెల్లవారుజామున 12.34 గంటలకు ధనుర్మాస ఘడియలు ప్రారంభం కానుండగా టీటీడీ ఈ మేరకు నిర్ణయం తీసుకుంది. డిసెంబరు 17 ఉదయం నుంచి స్వామివారికి నిర్వహించే సుప్రభాత సేవ స్థానంలో తిరుప్పావై నివేదించనున్నారు. ధనుర్మాస ఘడియలు 2024 జనవరి 14న ముగియనున్నాయి. పురాణాల ప్రకారం ధనుర్మాసంలో దేవతలు సూర్యోదయానికి గంటన్నర ముందుగా నిద్రలేచి బ్రహ్మ ముహూర్తంలో శ్రీమహావిష్ణువును ప్రత్యేకంగా ప్రార్థిస్తారట. కావున ఈ మాసానికి సౌరమానంలో ప్రత్యేక ప్రాధాన్యం ఉండగా నెలరోజులు ఆండాళ్ తిరుప్పావై పారాయణం జరగనుంది. 12 మంది ఆళ్వార్లలో శ్రీ ఆండాళ్(గోదాదేవి) ఒకరుకాగా ఈమెను నాచియార్ అని కూడా పిలుస్తారు. శ్రీవేంకటేశ్వరస్వామివారిని స్తుతిస్తూ ఆండాళ్ రచించిన 30 పాశురాలను కలిపి తిరుప్పావై అంటారు. ఆళ్వార్ దివ్యప్రబంధంలో తిరుప్పావై ఒక భాగం కాగా తమిళ సాహిత్యంలో దీనికి విశేష ప్రాచుర్యం ఉంది. శ్రీవారి ఆలయంలో నెల రోజులపాటు జరిగే తిరుప్పావై పారాయణంలో రోజుకొకటి చొప్పున అర్చకులు నివేదిస్తారు. ఈ సమయంలో సాధారణంగా భోగశ్రీనివాసమూర్తికి బదులుగా శ్రీకృష్ణస్వామివారికి ఏకాంతసేవ నిర్వహిస్తారు. ఈ తిరుప్పావై పఠనం పూర్తిగా ఏకాంతంగా జరుగుతుంది.

# అనంతలో 300 కోట్ల సైబర్ మోసం

అనంతపురం, డిసెంబర్ 8, అనంతపురం జిల్లా గార్లదిన్నె మండలం అగ్రహారం గ్రామానికి చెందిన అనిల్ కుమార్ తనకు జరిగిన సైబర్ మోసంపై జిల్లా పోలీసు కార్యాలయంలో జరిగిన స్పందనలో ఫిర్యాదు చేశారు. అతను తెలిపిన వివరాల ప్రకారం.. అనిల్ కుమార్ అనంతపురం నగరంలో ఓ ప్రైవేటు ఉద్యోగం చేస్తున్నాడు. తన ఫోన్ లోని టెలిగ్రామ్ యాప్ లో అతనికి సెప్టెంబర్ 21న ఒక మెసేజ్ వచ్చింది. మీకు ఏమైనా పార్ట్ టైమ్ జాబ్ చేయాలని ఉందా అని లింక్ వచ్చింది. పార్ట్ టైం జాబ్ కు ఆశపడి అనిల్ కుమార్ ఆ లింకును ఓపెన్ చేశాడు. నిర్వాణ డిజిటల్ గ్రూపులో ఆడ్ అయ్యారు. అనిల్ కు ప్రత్యేక యూజర్ ఐడి కూడా వచ్చింది. యూజర్ ఐడి ద్వారా నకిలీ పోర్టల్ లో యూట్యూబ్ వ్యాపార ప్రకటనలు అవతలి వారికి పంపిస్తుండాలని.. వాటిని సబ్‌స్క్రైబ్ చేసి రేటింగ్ ఇవ్వాలని.. ఇలా చేస్తే అధికంగా కమిషన్లు వస్తాయని నమ్మించారు. ముందుగా రూ.10 వేలు డిపాజిట్ చేస్తే వీడియోలు పంపిస్తామన్నారు. తన వద్ద డబ్బు లేదనడంతో మేమే చెల్లిస్తామంటూ రూ.10 వేలు కట్టినట్లు నకిలీ ఆధారాలు చూపించారు. అనిల్ కుమార్ అది నిజమని నమ్మి వారు పంపిన వీడియోలకు సబ్‌స్క్రైబ్ చేసి రేటింగ్ ఇచ్చాడు. మొదటగా రూ.800 కమిషన్ రూపంలో అనిల్ కుమార్ ఖాతాలో జమ అయ్యింది. దీంతో అనిల్ కుమార్ కు నమ్మకం ఏర్పడింది. ఇంకా ఎక్కువగా కమిషన్ రావాలంటే రూ.10 వేలు కట్టాలని సైబర్ నేరగాళ్లు మెసేజ్ పంపారు. పేటియం ద్వారా యూజర్ ఐడీకి పది వేలు పంపాడు. సైబర్ నేరగాళ్లు వీడియోలు పంపారు. కమిషన్ రూపంలో రెండోసారి రూ.2,625 వచ్చింది. తర్వాత సైబర్ నేరగాళ్లు ఒకేసారి రూ.50 వేలు పంపమన్నారు. అనిల్ కుమార్ అలాగే పంపాడు చివరకు ఖాతా హోల్డ్ లో పెట్టారు. మరోసారి రూ.1,50,000 పంపమని డిమాండ్ చేయగా ఆ మొత్తాన్ని వాళ్ళ ఖాతాల్లో వేశారు. అయినప్పటికీ ఐడీ హోల్డ్ లోనే ఉంది. ఎందుకు నా ఐడీ ఇంకా హోల్డ్ లో పెట్టారని అడగ్గా.. మరో నాలుగు లక్షల రూపాయలు పంపితే మొత్తం డిపాజిట్ అమౌంట్ తిరిగి పంపిస్తామని చెప్పారు. అంత డబ్బు కట్టలేనని చెప్పడంతో అనిల్ ఐడిని ఏకంగా బ్లాక్ చేశారు. ఐడిని బ్లాక్ చేయడంతో మోసపోయాడని తెలుసుకొని సైబర్ క్రైమ్ పోర్టల్ లో ఫిర్యాదు చేశాడు. ఈ కేసు ఆధారంగా జిల్లా ఎస్పీ అన్బురాజన్ ఆదేశాలతో సైబర్ నేరగాళ్ల జాడ కోసం టెక్నికల్ టీం సపోర్ట్ తో పోలీసులు దర్యాప్తు చేపట్టారు. కేసు దర్యాప్తు చేస్తున్న పోలీసులకు దిమ్మ తిరిగిపోయే లావాదేవీలు అందులో కనుగొన్నారు. సుమారుగా రూ.300 కోట్లకు పైగా ఈ సైబర్ నేరగాళ్లు నిరుద్యోగ యువత నుంచి డబ్బులు కొట్టేసినట్లు పోలీసులు కనుగొన్నారు. దీంతో జిల్లా ఎస్పీ అన్బురాజన్ ఈ కేసుపై ప్రత్యేక దృష్టి సారించి పోలీసులను ప్రత్యేక బృందాలుగా ఏర్పాటు చేసి మరింత లోతుగా విచారించాలని ఆదేశించారు. ఈ నేరగాళ్లలో ఆరుగురు ముఠా సభ్యులను అనంతపురం పోలీసులు అరెస్టు చేశారు. అరెస్ట్ చేసిన వారికి చెందిన 16 నకిలీ ఖాతాల నుంచి రూ.35 కోట్ల 59 లక్షల లావాదేవీలు జరిగినట్లు గుర్తించారు. రూ.14 కోట్ల 72 లక్షలను ఫ్రీజ్ చేయించారు. ఈ కేసు విచారణలో భాగంగా నేషనల్ క్రైమ్ రికార్డ్స్ బ్యూరోలో సుమారు 1,550 ఫిర్యాదులు ఉండగా వీటిలో లావాదేవీల అంచనా వేస్తే సుమారు రూ.300 కోట్లపై మాటే అని వెల్లడించారు. ఈ కేసులో ఎలాగైనా ప్రధాన నిందితుణ్ని అరెస్టు చేయాలని జిల్లా ఎస్పీ అన్బురాజన్ ఆదేశాలతో పోలీసు బృందం రాష్ట్ర సరిహద్దులు దాటి వెళ్లారు. టెక్నికల్ టీం ఆధారంగా కీలక నిందితుడు జమ్మూ కశ్మీర్ లో ఉన్నట్లు పోలీసులు గుర్తించారు. వెంటనే జమ్మూ కశ్మీర్ కు వెళ్లిన జిల్లా పోలీసులు సైబర్ నేరాల్లో ఆరు తేదీన కింగ్ పిన్ అనాయతుల్లా అలియాస్ ఫర్హాన్ ను పోలీసులు అరెస్టు చేశారు. స్థానిక జమ్మూ కశ్మీర్ పోలీసుల సహకారంతో అనాయతుల్లాను స్థానిక కుల్వారా మెజిస్ట్రేట్ ముందు హాజరు పరిచారు. నిందితుల నుంచి మరింత సమాచారం రాబట్టేందుకు ట్రాన్సిట్ వారెంట్ పై అనంతపురం జిల్లాకు తీసుకువచ్చి రిమాండ్ కు పంపారు.

# మిగ్ జాం తుఫాను...

## అంచనా వేసే పనిలో అధికారులు

## జనవరిలో నష్టపరిహారం...

నెల్లూరు, డిసెంబర్ 8, మిగ్‌జామ్ తుఫాన్ ఆంధ్రప్రదేశ్ రైతులను నిండా ముంచేసింది. ఆరుగాలం కష్టించి పండించిన పంట మొత్తం నీటిపాలైంది. తుఫాన్ ప్రభావిత జిల్లాల్లో ఎటు చూసినా నీట మునిగిన పొలాలు.. నేలకొరిగిన పంటచేలే కనిపిస్తున్నాయి. ఈ పరిస్థితుల్లో నష్టపోయిన రైతన్నలను ఆదుకునేందుకు ఏపీ ప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపడుతోంది. వీలైనంత త్వరగా వారికి నష్టపరిహారం అందించేందుకు కృషిచేస్తోంది. రైతులకు అండగా నిలవాలని అధికారులను కూడా ఆదేశించారు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి. అంతేకాదు పంట నష్టం అంచనాలకు ప్రత్యేక బృందాలను కూడా ఏర్పాటు చేసింది ఏపీ ప్రభుత్వం. వ్యవసాయ, ఉద్యాన శాఖలు, రెవెన్యూ శాఖతో కలిసి ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేశారు. పొలాల్లో ముంపు నీరు తగ్గిన తర్వాత... వెంటనే పంట నష్టం అంచనా మొదలుపెట్టాలని ఆదేశించారు సీఎం జగన్. ముఖ్యమంత్రి ఆదేశాలతో క్షేత్రస్థాయిలో అంచనాలను సిద్ధమవుతున్నాయి ప్రత్యేక బృందాలు. మరో రెండు వారాల్లో పంట నష్టం అంచనాలను ఒక కొలిక్కి తీసుకొచ్చేందుకు కృషి చేస్తున్నారు. ఈ నెలాఖరుకు లేదా జనవరి మొదటి వారంలో పరిహారం పంపిణీ చేసేలా ఏర్పాట్లు చేస్తున్నారు అధికారులు. తుఫాన్ కారణంగా నష్టపోయిన రైతులకు అడుగడుగునా అండగా నిలబడాలని ఆదేశించారు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి. ఇప్పటికే వర్షాలకు తడిసి, తేమ శాతం, రంగు మారిన ధాన్యాన్ని ఎప్పటికప్పుడు కొలుగోలు చేస్తున్నారు. సాంకేతిక కారణాలను పట్టించుకోకుండా, నిబంధనలు సడలించి మరీ... తడిసిన, రంగుమారిన ధాన్యాన్ని ప్రభుత్వమే కొంటోంది. రైతులకు నష్టం జరగకుండా... తడిసి, రంగుమారిన ధాన్యాన్ని కూడా మద్దతు ధరకే కొనుగోలు చేసి... మిల్లులకు తరలిస్తోంది. ఇక... నీటి మునిగిన పొలాలు, నేలకొరిగిన పంటల అంచనాలను త్వరగా పూర్తి చేయాలని ఆదేశించారు సీఎం జగన్. ముఖ్యంగా... వరితో పాటు మిరప, పత్తి, మొక్కజొన్న, వేరుశనగ పంటలపై తుఫాన్ తీవ్ర ప్రభావం చూపింది. అరటి పంటలు పూర్తిగా నేలకొరిగాయి. చేతికొచ్చిన పంట... నేలకూలడంతో రైతులు తీవ్ర ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అలాంటి రైతులందరికీ అండదండగా నిలవాలని అధికారులను ఆదేశించారు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి. ఖరీఫ్ సీజన్‌లో 64 లక్షల ఎకరాల్లో వ్యవసాయం, 29 లక్షల ఎకరాల్లో ఉద్యాన పంటలు సాగయ్యాయి. వర్షాభావ పరిస్థితుల వల్ల ఏడు జిల్లాల్లో 15 లక్షల ఎకరాల్లో పంటలు ఇప్పటికే దెబ్బతిన్నట్టుగా గుర్తించారు. ఇక 17 లక్షల ఎకరాల్లో పంటల కోతలు పూర్తయ్యాయి. మరో 15 లక్షల ఎకరాల్లో కోతలకు సిద్ధంగా ఉన్నాయి. ఈ పరిస్థితుల్లో మిగ్‌జామ్ తుఫాన్ కారణంగా... 80వేల ఎకరాల్లో పంటలు ముంపునకు గురయ్యాయని... కోతకు సిద్ధంగా ఉన్న లక్ష ఎకరాలకు పైగా పంట నేలకొరిగినట్టు ప్రాథమికంగా అంచనా చేశారు అధికారులు. అయితే... పూర్తిస్థాయిలో పంటనష్టం అంచనాలు సిద్ధం చేయాలని ప్రత్యేక బృందాలను పంపుతోంది ఏపీ ప్రభుత్వం. ఇప్పటికే వ్యవసాయ, ఉద్యాన శాఖల అధికారులు ఆర్బీకే సిబ్బందితో కలిసి క్షేత్ర స్థాయిలో పర్యటిస్తూ ఎప్పటికప్పుడు రైతులను అప్రమత్తం చేశారు.

# ఏపీపై కాంగ్రెస్ దృష్టి

విజయవాడ, డిసెంబర్ 8, తెలంగాణలో దక్కిన విజయంతో కాంగ్రెస్ ఆంధ్రప్రదేశ్ మీద కన్నేస్తోంది. ఈ గ్రాండ్ ఓల్డ్ పార్టీ ఉత్తరాది లోని కీలక రాష్ట్రాల్లో తన పట్టు కోల్పోతున్న వేళ... తన పునరుజ్జీవాన్ని దక్షిణాది నుంచి ప్రారంభించాలనుకుంటోంది. కర్నాటక, తెలంగాణ రాష్ట్రాల్లో ఇప్పటికే అధికారాన్ని అందుకోవడంతో, దక్షిణ భారతంపై ఆశలు పెరుగుతున్నాయి. తమిళనాడు, కేరళ, ఆంధ్రప్రదేశ్‌లలో మిత్రపక్షాలతో కలిసి అధికారం పంచుకోవడంపై ఆ పార్టీ ఆలోచనలు చేస్తోంది. దక్షిణాదిలో బీజేపీ ఇంత తొందరగా పాగా వేసే పరిస్థితులు కనిపించడం లేదు. కమలం బలమంతా ఉత్తరాదే. ఆంధ్ర, తమిళనాడు, కేరళ, తెలంగాణలలో ప్రాంతీయ పార్టీల హవా కొనసాగుతోంది. ఓ పదేళ్ల కిందట వరకూ అవిభాజ్య ఆంధ్రలో అధికారాన్ని అనుభవించిన హస్తం పార్టీ, అడ్డగోలు రాష్ట్ర విభజనతో రెండు చోట్లా పరువు పోగొట్టుకుంది. తెలంగాణలో భారత రాష్ట్ర సమితి నేతల స్వయం కృతాపరాధం వల్ల మాత్రమే కాంగ్రెస్ మళ్లీ ఫాంలోకి వచ్చింది. ఈ ఎన్నికలు కేసీయార్ పరాజయమే తప్ప... కాంగ్రెస్ ఘన విజయంగా శ్లాఘించాల్సిన అవసరం లేదు. తెలంగాణలో తన పార్టీని పోటీకి పెట్టకుండా పరోక్షంగా కాంగ్రెస్‌కు సహకరించిన చంద్రబాబు మీదే సోనియా అండ్ కో ఆశలు పెట్టుకున్నారు. చంద్రబాబు కూడా రెండు జాతీయ పార్టీల ఆప్షన్లూ ఓపెన్‌గా ఉంచుకున్నారు. చివరి నిముషం వరకూ భాజపాతో పొత్తు కోసం ప్రయత్నించాలనుకుంటున్నారు. మూడు రాష్ట్రాల విజయంతో భాజపా మంచి ఊపు మీద ఉంది. 2004 లోక్‌సభ ఎన్నికల్లో మోదీకి ప్రత్యామ్నాయం కనుచూపు మేరలో కనిపించడం లేదు. చంద్రబాబుకు భాజపా ఫస్ట్ అండ్ బెస్ట్ ఆప్షన్. మోదీ, షాలను కన్విన్స్ చేయడానికి ఆయన పవన్‌ను కూడా వాడుకోవాలనుకుంటున్నారు. ఆ రాయబారం కాంగ్రెస్‌ను తన కూటమిలో కలుపుకుంటారు. ఏపీలో చంద్రబాబు కాంగ్రెస్‌కు ఓ పది సీట్లు ఇచ్చే అవకాశం ఉందని తెలుగుదేశం వర్గాలు చెబుతున్నాయి. ఇదే కనుక జరిగితే ఏపీలో మళ్లీ కాంగ్రెస్ జెండా రెపరెపలాడొచ్చు. రాష్ట్ర విభజన వల్ల తెలంగాణకు తప్ప ఆంధ్రకు ఎలాంటి ప్రయోజనం లేదు.

# అనంతలో స్టాట్యూ వార్

అనంతపురం, డిసెంబర్ 8, అనంతపురం జిల్లాలో విగ్రహాల వార్ నడుస్తోంది. బీజేపీ వర్సెస్ వైసీపీగా రాజకీయం మారింది. సర్దార్ వల్లభాయ్ విగ్రహం పెడతామని బీజేపీ అంటుంటే టిప్పు సుల్తాన్ విగ్రహం పెడతామని వైసీపీ చెప్తోంది. దీంతో ఏక్షణాన ఏం జరుగుతుందోనన్న ఉత్కంఠ నెలకొంది. నగరంలో సర్దార్ వల్లభాయ్ పటేల్ విగ్రహం పెడతామని అధికారులకు బీజేపీ దరఖాస్తు చేసుకుంది. ఆ దరఖాస్తుపై అధికారులు స్పందించాల్సి ఉంది. ఇంతలో కొంతమంది వైసీపీ నేతలు టిప్పు సుల్తాన్ విగ్రహం పెట్టేందుకు రెడీ అయ్యారు. అంతేకాదు బీజేపీ అనుకున్న స్థలంలోనే ఏకంగా భూమి పూజ కూడా చేసేశారు. ఈ వ్యవహారం అటు బీజేపీ ఇటు వైసీపీల మధ్య రాజకీయ యుద్ధానికి తెరలేపింది. సర్దార్ వల్లభాయ్ పటేల్ విగ్రహం పెడతామనుకున్న చోట వైసీపీ నాయకులు టిప్పు సుల్తాన్ విగ్రహం కోసం పూజాది కార్యక్రమాలు చేయడంపై మండిపడ్డారు. ఈ అంశంపై బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు విష్ణువర్ధన్ రెడ్డి స్పందించారు. సర్దార్ వల్లభాయ్ పటేల్, టిప్పు సుల్తాన్ విగ్రహాల విషయంలో ప్రజాభిప్రాయం తీసుకుందాం అంటూ వైసీపీకి సవాల్ విసిరారు. ఎవరి విగ్రహం కావాలో ప్రజలే నిర్ణయిస్తారన్నారు. కొంతమంది స్వార్థ రాజకీయల కోసం విగ్రహాల మీద రాజకీయం చేస్తున్నారు అని మండిపడ్డారు. ప్రజల మధ్య చిచ్చు పెట్టాలని కొంతమంది చూస్తున్నారని.. ఓటు బ్యాంకు రాజకీయాల ముసుగులో శాంతి భద్రతల ఘర్షణ వాతావరణం ఏర్పడే విధంగా వైసీపీ చేస్తోంది అని మండిపడ్డారు. వైసీపీ కేంద్ర కార్యాలయం ఆదేశాలతోనే పార్టీ నేతలు ఇలాంటి దుర్మార్గపు చర్యలకు దిగుతున్నారని బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు విష్ణువర్ధన్ రెడ్డి ఆరోపించారు. సర్దార్ వల్లభాయ్ పటేల్ విగ్రహం ఏర్పాటుకు సంబంధించి అనుమతి కోరుతూ దరఖాస్తు చేశామో అదే ప్లేస్‌లో 10 రోజుల్లో బీజేపి సర్దార్ వల్లభాయ్ పటేల్ విగ్రహం పెడుతుంది అని బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు విష్ణువర్ధన్ రెడ్డి తెగేసి చెప్పారు. ఎవరు అడ్డుకుంటారో చూస్తాం అని అన్నారు. అనంతపురం అర్బన్ వైసీపీ టికెట్ కోసం విగ్రహాల వివాదం తెరమీదకు తెచ్చారు అని ఆగ్రహం వ్యక్తం చేశారు. మీ టికెట్ పంచాయితీ తాడేపల్లిలో తేల్చుకోండి... ప్రశాంతంగా ఉన్న అనంతపురంలో కాదు అని చెప్పుకొచ్చారు. బీజేపీ పార్టీతో చేతనైతే రాజకీయంగా తేల్చుకోండి... మా పార్టీ సిద్ధంగా ఉంది అని ఛాలెంజ్ చేశారు. గతంలో ప్రొద్దుటూరులో ప్రయత్నాలు చేసి విఫలమైంది. ఏపీలో ఎక్కడా లేని టిప్పు సుల్తాన్ విగ్రహం అనంతపురంలో ఎందుకు అని నిలదీశారు. కనీసం ఆయన పుట్టిన మైసూర్‌లో కూడా లేదు అని చెప్పుకొచ్చారు.

# శ్రీశైలం మల్లన్న సేవలో మంత్రి కొట్టు సత్యనారాయణ

శ్రీశైలం కార్తీక మాసం సందర్భంగా శ్రీశైలం శ్రీ భ్రమరాంబ మల్లికార్జునస్వామి అమ్మవార్లను ఏపీ దేవాదాయశాఖ మంత్రి కొట్టు సత్యనారాయణ దంపతులు దర్శించుకున్నారు. శ్రీస్వామి అమ్మవారి దర్శనార్థం ఆలయం వద్దకు చేరుకున్న మంత్రి కొట్టు దంపతులకు ఆలయ అర్చకులు, ఆలయ ఈవో పెద్దిరాజు సాదర స్వాగతం పలికారు. అనంతరం మంత్రి కొట్టు సత్యనారాయణ దంపతులు శ్రీస్వామి అమ్మవార్లను దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు.

## శ్రీ హరిహర పుత్ర అయ్యప్ప స్వామి దేవాలయం లో 21 రోజులు అన్న ప్రసాద వితరణ.



విభారె న్యూస్ డిసెంబర్ 08 ఎమ్మిగనూరు. 17/11/23 నుండి 08/12/23 వరకు ఎమ్మిగనూరులో శ్రీ అయ్యప్ప స్వామి దేవాలయం నందు కార్తీకమాసం నందు మాల ధరించిన అయ్యప్ప స్వాములకు,శివ స్వాములకు,సాయిబాబా స్వాములకు, భక్తులకు 21 రోజుల పాటు నిర్విఘ్ననీగా అన్నదానం చేసిన శ్రీ సుంకులమ్మ స్వీట్స్ యజమాని లక్ష్మీ నారాయణ,భార్య భవాని ల కుమార్తె డాక్టర్ ఉమామహేశ్వరి లు అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేయబడినది. వీరికి వీరి కుటుంబాన్ని ఎల్లవేళలా ఆయురారోగ్యలతో, అష్టైశ్వర్యాలతో ఆ భగవంతుడు సంతోషంగా చూడాలని అయ్యప్ప స్వామి కోరుకుంటున్నాం అన్నారు. ఇట్లు శ్రీ అయ్యప్ప స్వామి సేవా సమితి ఎమ్మిగనూరు.

## ఛాయ విజయ్ కుమార్, ప్రీతీల వివాహానికి హాజరైన టిడిపి నేతలు..



విభారె న్యూస్ డిసెంబర్ 08 ఎమ్మిగనూరు. 8-12-2023 న శుక్రవారం పట్టణంలో కుర్ని కళ్యాణ మంటపం నందు 4 వ వార్డుకు చెందిన చాయ వీరేష్ కుమారుడు చాయ విజయ్ కుమార్, ప్రీతి ల వివాహం ఘనంగా జరిగింది. ఈ వివాహ వేడుకలకు టిడిపి నేతలు ఆరవీటి సుధాకర్ శెట్టి, కదిరికోట ఆదెన్న, మాజీ జిల్లా వక్ఫ్ బోర్డు డైరెక్టర్ జి.అల్తాఫ్ లు హాజరై నూతన వధూవరులను ఆశీర్వదించి శుభాకాంక్షలు తెలియజేశారు.

## శ్రీ హరిహర పుత్ర అయ్యప్ప స్వామి దేవాలయం లో 25 వ రోజు అన్న ప్రసాద వితరణ..



విభారె న్యూస్ డిసెంబర్ 08 ఎమ్మిగనూరు. స్వాములకు అన్నప్రసాద వితరణ కార్యక్రమంలో భాగంగా శుక్రవారం 25వరోజు 08- 1- 2023 శుక్రవారం దాతలుఎమ్మిగనూరు వాస్తవ్యులుశ్రీ సుంకులమ్మ అవ్వ స్వీట్ స్టాల్ వినోద్ కుమార్ శ్రీమతి ఉమామహేశ్వరి ఎంబీబీఎస్ ఎంఎస్, గుర్రేవల కృష్ణమోహన్ శ్రీమతి పద్మజ, ఎం. రామాంజనేయులు శ్రీమతి కృష్ణవేణి (అంజలి డ్రెస్సెస్), ఆర్.పవన్ కుమార్ శ్రీమతి శ్వేత కుటుంబ సభ్యులు సేవ,కలుగట్ల గ్రామం వాస్తవ్యులు ఈ. నరసన్న గౌడ్,శ్రీమతి లక్ష్మి ఆలయంలో అన్నదానం ఏర్పాటు చేసినారు.వారిని వారి కుటుంబాలకు శ్రీ హరిహర పుత్ర అయ్యప్ప స్వామి వారి కృపా కటాక్షములు ఉండాలని ,ఎల్లవేళలా ఆయురారోగ్యాలు అష్టైశ్వర్యాలతో వర్ధిల్లాలనిస్వామి వారిని ప్రార్థిం చారు.ఆలయంలో అన్నదానం పెట్టదలచుకున్న దాతలు కమిటీ వారిని సంప్రదించి తగు తేదీలను నమోదు చేయించు కోగలరు..అదేవిధంగా అన్నదాన కార్యక్రమం విజయవంతం చేయాలని,స్వామివారి కృపా కటాక్షములు పొందగలరని కోరుతున్నాము..ఇట్లు – ఆలయకమిటీసెల్: 9951801818.

## వికలాంగుల హక్కుల పోరుబాట యాత్ర కు సంపూర్ణ సంఘీభావం తెలిపిన మల్లెల గ్రూప్స్, జై భీమ్ ఎమ్మార్పీఎస్..



విభారె న్యూస్ డిసెంబర్ 08 ఎమ్మిగనూరు. వికలాంగుల హక్కులు చట్టాలు రాయితీ రిజర్వేషన్ల సాధనకై తలపెట్టిన 100 కిలోమీటర్ల పాదయాత్ర ను, ఆదోనిలోని మున్సిపల్ హై స్కూల్ నుండి మల్లెల గ్రూప్స్ అధినేత డాక్టర్ ఆల్ ఫ్రెడ్ రాజు జండా ఊపి, వికలాంగుల పోరు బాట యాత్రను ప్రారంభించడం జరిగింది. ఈ యాత్రకు జై భీమ్ ఎమ్మార్పీఎస్, మల్లెల గ్రూప్ సభ్యులు సంపూర్ణ సంఘీభావం తెలియజేయడం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా విచ్చేసినటువంటి మల్లెల గ్రూప్స్ అధినేత డాక్టర్ మల్లెలఆల్ఫ్రెడ్ రాజు, జై భీమ్ ఎమ్మార్పీఎస్ రాష్ట్ర వ్యవస్థాపక అధ్యక్షులు చిక్కం జానయ్య పాల్గొని, దివ్యాంగుల తో పాటు పాదయాత్ర చేయడం జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, వికలాంగుల హక్కులు చట్టాలు రాయితులు రిజర్వేషన్లు సాధనకై తలపెట్టిన వికలాంగుల హక్కులు పోరుబాట యాత్ర విజయవంతం కావాలని, దివ్యాంగులకు సంబంధించిన న్యాయపరమైన డిమాండ్లు ఏవైతే ఉన్నాయో 6000 రూపాయలు పెన్షన్ గాని, ఇళ్ల స్థలాలు గాని, ఉద్యోగాలు గాని, సబ్సిడీ లోన్లు గాని, కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు వెంటనే తీర్చాలని, దివ్యాంగులు ఆర్థికంగా అభివృద్ధి బాటలో నడిచే విధంగా ప్రభుత్వాలు సహాయ సహకారాలు అందించాలని, మాట్లాడడం జరిగింది. అంతేకాక వికలాంగులకు ఆర్థికంగానూ,అన్ని విధాలుగా సహాయ సహకారాలు అందిస్తామని, ఈ యాత్రకు వివిధ ప్రజా సంఘాలు, వివిధ రాజకీయ పార్టీలు అందరూ కూడా సంఘీభావం తెలపాలని పిలుపునివ్వడం జరిగింది. ఈ కార్యక్రమంలో జై భీమ్ ఎమ్మార్పీఎస్ కర్నూలు జిల్లా అధ్యక్షులు ముత్తు సుమాల, జై భీమ్ ఎమ్మార్పీఎస్ కర్నూలు జిల్లా ప్రధాన కార్యదర్శి గర్జి హనుమన్న, ఎస్సీ ఎస్టీ బీసీ మైనార్టీ మహిళా సంఘ నాయకురాలు భారతమ్మ,న్యూ లైఫ్ స్వచ్ఛంద సంస్థ నిర్వాహకులు సామేలు, డివైఎఫ్ఐ నాయకులు అజీత్, మల్లెల గ్రూప్ సభ్యులు సతీష్ రంజిత్ సామెల్ సాల్మన్ సురేష్ వివిధ ప్రజా సంఘాల నాయకులు కుల సంఘాల నాయకులు మొదలగువారు పాల్గొన్నారు.

## బిల్లలాపురం లో టీడీపీని వీడి వైయస్సార్ పార్టీ లో చేరిక



విభారె న్యూస్ నంద్యాల మా ప్రతినిధి డిసెంబర్ 08-నంద్యాల మండలం బిళ్ళలాపురం గ్రామం హరిజన మత్స్యకార సంఘానికి చెందిన 30 కుటుంబాలు మాజీ మార్కెట్ యార్డ్ ఛైర్మన్ సిద్దం శివరాం, సుబ్బయ్య ఆధ్వర్యంలో టీడీపీని వీడి వైయస్సార్ పార్టీ లో చేరారు . వీరికి ఎమ్మెల్యే శిల్పా రవిచంద్ర కిషోర్ రెడ్డి వైఎ?సార్సీపీ కండువాలను కప్పి సాదరంగా ఆహ్వానం పలికారు. వైఎస్సార్సీపీ కుటుంబంలో చేరడం అభినందనీయం అన్నారు. నేటి నుండి మీరంతా నా కుటుంబం అనిపేర్కొన్నారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ...టీడీపీకి వీరవిదేయులైన వీరు వైయస్సార్ ప్రభుత్వంలో సీఎం వైఎస్ జగన్మోహన్ రెడ్డి చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ పాలన ఆకర్షితులై పార్టీలో చేరడం సంతోషంగా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ దిబ్బన్న, మాజీ సర్పంచ్ వెంకటేశ్వర్లు, బండి చిన్న ఓబులేసు, లక్ష్మి నారాయణ, ఓబయ్య, రాజశేఖర్, పుష్ప రాజ్, స్వామిదాస్, కృష్ణ, తదితరుల పాల్గొన్నారు.

## మహిళలను లైంగిక వేదించడం వల్లనే యువకుడు దారుణహత్య

### హత్య కేసును ఛాలెంజ్ తీసుకొని ఛేదించిన పోలీసులు



కోసిగి,డిసెంబర్ 08(విభారె న్యూస్)హత్యకు పాల్పడిన నిందితుడి ఇంట్లో ఉన్న మహిళలను లైంగికంగా వేధించడం వల్లనే యువకుడు నాగరాజు ను హత్య చేసినట్లు హత్యకు పాల్పడిన కోసిగికి చెందిన నాగిరెడ్డి అలియాస్ చాపలరాజు తెలిపినట్లు సిఐ ఏరీషావలి తెలిపారు. శుక్రవారం కోసిగి సిఐ కార్యాలయంలో విలేకరుల సమావేశం ఏర్పాటు చేసి హత్య చేసిన నిందితుడిని, హత్యకు వాడిన వేటకొడవలిని విలేకరుల కు చూపించడం జరిగింది. గత ఎనిమిది రోజుల క్రితం కోసిగిలోసంచలనం సృష్టించిన జిల్లేడాకుల నాగరాజు హత్య కేసును పోలీసులు ఛాలెంజ్ తీసుకుని లోతైన దర్యాప్తు చేసి కేసును చేదించడం జరిగింది. ఈ సందర్భంగా విలేకరులతో సిఐ మాట్లాడుతూ మండల కేంద్రమైన కోసిగిలో గత నెల 30 తారీఖున కోసిగి గాంధీనగర్ కు చెందిన జిల్లాడాకుల, నాగరాజు దారుణహత్యకు గురికావడం జరిగిందని అయితే హత్యకు గురైన నాగరాజు ఊర్లో ఎంతో మంచి వాడని ఎవరు హత్య చేశారో తమకు తెలియదని కుటుంబ సభ్యులు పోలీసులకు తెలపడంతో అదేరోజు జిల్లా ఎస్పీ కృష్ణ కాంత్ , డిఎస్పీ సీతారామయ్య ఆదేశాల మేరకు క్లూస్ టీమ్ తో ఆధారాలు సేకరించి, డాగ్ స్కాడ్ తో కూడా దర్యాప్తు చేయించినట్లు సీఐ తెలిపారు. హతుడు నాగరాజు భార్య చిట్టెమ్మ ఇచ్చిన పిర్యాదు మేరకు కేసు నమోదు చేసి మరింత లోతుగా దర్యాప్తు చేయగా హతుడు జిల్లాడాకుల నాగరాజు ముద్దాయి చేపలరాజు కుటుంబంలోని మహిళను లైంగికంగా గత ఆరు నెలలుగా వేధిస్తూ న్నాడని, ఎన్నిసార్లు వార్నింగ్ ఇచ్చిన పట్టించు కోకుండా అలానే వేదిస్తుం డడంతో పాటు, మీసాలు మెలివేసుకుంటు తిరుగుతూ అవమానం కు గురిచేయడంతో కోపోద్రేకుడై హత్య చేసినట్టు అదేకాలనికి చెందిన చేపల రాజు తెలిపినట్లు సిఐ తెలిపారు. హత్యకు మూడురోజుల ముందు కోసిగి లోని గుజరి అంగడిలో వేటకొడవలిని కొనుగోలు చేసినట్లు, ప్రతి రోజు జిల్లేడాకుల నాగరాజు కదలికల పై నిఘా ఉంచి హత్య చేయడానికి చేపల రాజు పథకం వేశడన్నారు. అయితే గత నెల 30 తారీకున ఉదయమే 5గంటల 30 నిమిషాల



సమయంలో ఇంటి నుండి పల్ససర్ బండిపై నాగరాజు బహిర్భూమి వెళ్లగా ముందుగానే హత్య చేయడానికి పథకం వేసుకున్న ముద్దాయి చేపల రాజు వేటకొడవలితో వెళ్లి నాగరాజు బహిర్భూమి కూర్చున్నప్పుడే చంపాలనుకున్న ప్పటికి , మరికొంతమంది బహిర్భూమి కూర్చొని ఉండడంతో మనస్సు మార్చుకొని , దారిలో ఉన్న చెట్టు దగ్గరికి కాపు కాసి బండి పై వస్తున్న నాగరాజుపై ఒక్కసారిగా దాడి చేసి వేటకొడవలితో నరికి చంపి వేసినట్లు తెలిపారు. గల ఎల్ ఎల్ సి కాలువపై బండిపై పరార్ అవుతూ మండల పరిధిలోని బేలగల్లు దగ్గర చెరువు వద్ద చెట్లల్లో హత్యకు ఉపయోగించిన కోడలిని దాచి పెట్టి, తన బట్టలను భూట్లను కాల్చి వేసి , మాలపల్లి, పల్లిపాడు, చింతకుంట గ్రామాలమీదుగా తిరిగి కోసిగిలోని ఇంటికి వచ్చి స్నానం చేసినట్లు సిఐ తెలిపారు. దర్యాప్తులో భాగంగా అన్ని కోణాల్లో విచారిస్తూ ఉండగా, అనుమానాస్పదంగా ఉన్న చేపల రాజును విచారించగా జరిగిన ఉదంతం వెలుగులోకి వచ్చినట్లు సిఐ తెలిపారు. ముద్దాయి చేపల రాజుపై హత్య కేసు నమోదు చేసి రిమాండ్ కు తరలించి నట్లు ఆయన తెలిపారు. ఈ హత్య కేసును ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ఎంతో లోతుగా దర్యాప్తు చేసి ఛేదించిన కౌతాళం ఎస్సై నరేంద్ర కుమార్ రెడ్డి, కోసిగి ఎస్సై సతీష్ కుమార్ లను సిబ్బందిని ఆయన అభినందించారు.

## కార్తీకమాస ముగింపు ఉత్సవాలు జయప్రదం చేయండి

### ఈవో చంద్రశేఖర్ రెడ్డి చైర్మన్ మహేశ్వర్ రెడ్డి



--విభారె న్యూస్ నంద్యాల మా ప్రతినిధి డిసెంబర్ 08- మహానంది క్షేత్రంలో 11-12- తేదీల్లో ముగింపు ఉత్సవాలు ఘనంగా జరుగుతాయని ఈవో చంద్రశేఖర్ రెడ్డి. ఛైర్మన్ మహేశ్వరరెడ్డి శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. వారు మాట్లాడుతూ సోమవారం,కార్తీక మాస మాసశివరాత్రి సందర్భంగా శ్రీ మహానందీశ్వర స్వామి వారికి ఉదయం మహన్యాస పూర్వక మహారుద్రాభిషేకంసాయంత్రం ప్రదోష కాలంలో లక్ష బిల్వార్చనలు , మంగళవారం,కార్తీక మాస అమావాస్య సందర్భంగా శ్రీ కామేశ్వరి అమ్మవారికి లక్ష కుంకుమార్చన, చండీహోమము,దీక్షాహోమాలుసాయంత్రం లోక శాంత్యర్థం శ్రీ కామేశ్వరి మహానందీశ్వరుల శాంతి కళ్యాణోత్సవములు నంద్యాల రామకృష్ణ విద్యాసంస్థల అధినేత డా.గడ్డం రామకృష్ణారెడ్డి, విజయకుమారిల సహకారంతో అత్యంత వైభవంగా జరుపబడుతుందని తెలిపారు . కార్తీక మాస ముగింపు ఉత్సవాల్లో పాల్గొని శివకటాక్షమును భక్తులు పొందాలని సూచించారు.

## అభివృద్ధి వైపు నందమూరి నగర్

### వైయస్సార్ పార్టీ వార్డు ఇంచార్జి యూసుఫ్



విభారె న్యూస్ నంద్యాల మా ప్రతినిధి డిసెంబర్ 08- 37 వార్డు నందమూరి నగర్ యందు శుక్రవారం వార్డు కు పోదాం (వై ఏపి నీడ్స్ జగన్) కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా వార్డు ఇన్చార్జ్ యూసఫ్. వార్డు వైసిపి కన్వీనర్ అస్లాం భాషా మెప్మా పీడీ భాస్కర్ రెడ్డి హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో భాగంగా అందిన సంక్షేమ పథకాల యొక్క బోర్డును ఆవిష్కరించారు. సంక్షేమ పథకాల ద్వారా నందమూరి నగర్ వార్డు సచివాలయ పరిధిలో 17 కోట్ల 69 లక్షల రూపాయలు వివిధ పథకాల ద్వారా ప్రజలు లబ్ధి పొందడం జరిగిందని వార్డు సచివాలయ సిబ్బంది అడ్మిన్ కే వెంకట సుధాకర్, వెల్ఫేర్ సెక్రటరీ జయరామ్ నాయక్ తెలిపారు. ఈ నాలుగున్నర సంవత్సరాలలో ప్రభుత్వం ద్వారా ప్రజలు పొందినటువంటి లబ్ధిని జరిగినటువంటి అభివృద్ధిని సంక్షేమాన్ని వార్డు ఇంచార్జ్ యూసఫ్ మరియు మెప్మా పీడీ భాస్కర్ రెడ్డి ప్రజలకు వివరించారు . ఈ కార్యక్రమం నందు వార్డు సచివాలయ సిబ్బంది , వాలంటీర్లు , వార్డు ప్రజలు, ప్రజాప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు .

## సెలవు దినాలలో పాఠశాల నిర్వహిస్తే కఠిన చర్యలు

×---విభారె న్యూస్ నంద్యాల మా ప్రతినిధి డిసెంబర్ 08- డిశంబర్ 9 - 10 తేదీలలో రెండవ శనివారం మరియు ఆదివారాలలో జిల్లాలోని అన్ని యాజమాన్యాల పాఠశాలల్లో ఎటువంటి తరగతులు నిర్వహించకూడదని డీఈవో శుక్రవారం ఓ ప్రకటన విడుదల చేశారు. నిబంధనలకు విరుద్ధంగా తరగతులు నిర్వహించే పాఠశాలలపై కఠిన చర్యలు తీసుకుంటామని తెలిపారు. మండల విద్యాశాఖాధికారులు మరియు సీ.ఆర్.పి లు ఈ విషయమై ప్రత్యేక దృష్టిపెట్టి ఆయా మండలాల్లోని పాఠశాలల్లో తరగతులు నిర్వహించకుండ చర్యలు తీసుకోవలసిందిగా సూచించారు.



EDITED, PRINTED,PUBLISHED AND OWNED BY AVULA VIJAYA BHASKARA REDDY PRINTED AT SRI SANTOSH PRINTERS SHOP NO. 67-58/A2,OPP TAMIL NADU MERCANTILE BANK, OLD BUSTAND, KURNOOL- 518 001. ANDHRA PRADESH. PUBLISHED FROM AVULA HUSSAIN REDDY COLONY,7-5-230, NANDYAL ROAD ALLAGADDA-518 543. KURNOOL DISTRICT. ANDHRA PRADESH. EDITOR : AVULA VIJAYA BHASKARA REDDY. RNI No : APTEL/2019/77190